**Andhra Jyothi**

# సివిల్స్ వయోపరిమితి తగ్గింపు!

## 32 నుంచి 26 ఏళ్లకు కుదించే చాన్స్.. పరీక్ష అవకాశాలూ ఆరు నుంచి నాలుగుకు!

- బాస్వాన్ కమిటీ సిఫారసులు

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సర్వీసు పరీక్షలు రాయాలనుకుంటున్న అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిని కుదించాలని కేంద్రం భావిస్తోందా? పరీక్షా విధానం, వెయిటేజీ, ఇంటర్వ్యూల నిర్వహణలోనూ సంస్కరణలు తీసుకొచ్చే యోచనలో ఉందా? ఈ ప్రశ్నలకు అధికార వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు ప్రస్తుతమున్న 32 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిని 26 ఏళ్లకు కుదించాలని బీఎస్ బాస్వాన్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. యూపీఏ హయాంలో సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీశాట్)ను ప్రవేశపెట్టడంపై పెద్దఎత్తున వ్యతిరేకత, ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో సివిల్స్ పరీక్షల్లో సంస్కరణలపై ఎన్డీఏ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా తొలుత సీశాట్‌ను తొలగించింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మానవ వనరుల అభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి భారతేంద్రసింహ్ బాస్వాన్ సారథ్యంలో ఓ నిపుణుల కమిటీని నియమించింది. దేశవ్యాప్తంగా ప్రజల అభిప్రాయాలు తీసుకుని, అన్ని కోణాల్లోనూ పరిశీలించి ఈ కమిటీ ఒక నివేదిక రూపొందించింది. ఇందులో గరిష్ఠ వయోపరిమితిని తగ్గించడంతో పాటు ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూల తీరులో మార్పులపైనా పలు సిఫారసులు చేసింది. ప్రస్తుతం దాదాపు ఏడాదిపాటు సాగుతున్న సివిల్స్ పరీక్ష ఫలితాల కాలవ్యవధిని తగ్గించాలని, ఇందులో భాగంగా ప్రిలిమ్స్‌ను వీలైతే ఆన్‌లైన్‌లో నిర్వహించి త్వరగా ఫలితాలు విడుదల చేయాలని సూచించింది. సివిల్స్ ఇంటర్వ్యూల్లో పక్షపాతానికి తావులేకుండా ఒకటికి బదులు రెండు ఇంటర్వ్యూలు నిర్వహించాలనే ప్రతిపాదన కూడా బాస్వాన్ కమిటీ ప్రజాభిప్రాయాన్ని సేకరించే సమయంలో వచ్చింది. మెయిన్స్‌లో ఆప్షన్స్ తీరులోనూ మార్పులు చేయాలని కమిటీ సూచించింది. ప్రస్తుతం సివిల్స్ రాసే అవకాశాల సంఖ్యను కూడా 6 నుంచి నాలుగుకు కుదించాలని పేర్కొంది. కమిటీ సిఫారసులను తొలుత యూపీఎస్సీ ఆమోదించాలి. తర్వాత కేంద్రం కూడా సరేనంటేనే అమల్లోకి వస్తాయి. వయోపరిమితి తగ్గింపుపై బాస్వాన్ కమిటీ ప్రస్తుతం రోడ్ మ్యాప్ రూపొందించే పనిలో ఉంది. ఒకవేళ ఈ సిఫారసులను కేంద్రం ఆమోదిస్తే.. వాటిని తక్షణమే అమలుచేయరని, అభ్యర్థులకు సరిపడా సమయం ఇస్తారని కమిటీ పలు సందర్భాల్లో వెల్లడించింది. 1960వ దశకంలో సివిల్స్ పరీక్ష రాసేందుకు జనరల్ కేటగిరీ అభ్యర్థులకు వయోపరిమితి 24 ఏళ్లుగా ఉండేది. ఇప్పుడు వయోపరిమితి 32 ఏళ్లుగా ఉంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు అదనంగా, బీసీ అభ్యర్థులకు మూడేళ్లు, వికలాంగులకు పదేళ్లు మినహాయింపునిచ్చారు. 2012, 2013ల్లో 30వ ఏట సివిల్స్ సాధించిన అభ్యర్థుల సంఖ్య 6 నుంచి 11 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో గరిష్ఠ వయోపరిమితిని 26కు తగ్గిస్తే చాలా మంది సమర్థులకు సివిల్స్ ఒక కలగా మిగిలిపోయే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అలాగే సివిల్స్ అభ్యర్థుల్లో డాక్టర్లు కూడా తగ్గిపోతారన్నారు. ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేసేసరికే వారి వయసు 23-25 మధ్య ఉంటుందని, సివిల్స్ రాసేందుకు వారికి ఒకట్రెండేళ్లు మాత్రమే సమయం ఉంటుందని వివరించారు. వయోపరిమితి తగ్గితే అభ్యర్థులు ఎక్కువ సార్లు సివిల్స్ పరీక్షలకు హాజరు కాలేరని గుర్తుచేశారు. కాగా.. ఇదే బాస్వాన్ కమిటీ గతంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల కొరతపై కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాల వారీగా ఒక నివేదిక సమర్పించింది. 2020 నాటికి ఉమ్మడి ఏపీలో 87 మంది ఐఏఎస్ అధికారుల కొరత ఉంటుందని అందులో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే అఖిల భారత సర్వీసు పరీక్షల్లో సంస్కరణల బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు.



బి.ఎస్. బాస్వాన్